

ఎఎస్‌పిగా తిప్పేస్వామి

శ్రీకాకుళం ప్రతినిధి : జిల్లా అదనపు ఎస్‌పి (అడ్మిన్)గా జె.తిప్పేస్వామి నియమితులయ్యారు. ఈమేరకు ప్రభుత్వం శుక్రవారం జిఒ నంబరు 547ను విడుదల చేసింది. చిత్తూరు ట్రాఫిక్ డిఎస్‌పిగా పనిచేస్తున్న ఆయన ఉద్యోగోన్నతిపై జిల్లాకు బదిలీ అయ్యారు. గతంలో ఎఎస్‌పి (అడ్మిన్)గా పనిచేసిన కె.శ్రీనివాసరావు స్థానంలో ఆయన వస్తున్నారు.

ట్రైనింగ్ సెంటర్ డిఎస్‌పి బదిలీ

శ్రీకాకుళం రూరల్ మండలం తండ్యాంవలసలోని జిల్లా ట్రైనింగ్ సెంటర్ డిఎస్‌పి జి.శ్రీనివాసరావు బదిలీ అయ్యారు. ఆయనకు ఉద్యోగోన్నతి కల్పించి విశాఖపట్నం ట్రాఫిక్ అడిషనల్ డిసిపిగా ప్రభుత్వం బదిలీ చేసింది.

వరి సాగు తగ్గించాలి

- **ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు మళ్లేలా చూడండి**
- **ఖరీఫ్‌లో సకాలంలో సాగు నీరందేలా చర్యలు**
- **రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు**

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో రైతులు వరికి సంప్రదాయ పంటగా అలవాటు పడ్డారని, దాన్ని తగ్గించి ఇతర ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపేలా చూడాలని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన నీటిపారుదల సలహా మండలి 29వ సమావేశం, వ్యవసాయ సలహా మండలి సమావేశాల్లో ఆయన మాట్లాడారు. వరితో పాటు మరింత లాభాలను ఆర్జించేలా నువ్వు, మొక్కజొన్న, మినుములు, పెసర, శనగ వంటి ఇతర పంటల వైపు దృష్టిసారించేలా రైతులను చైతన్యపరచాలన్నారు. గతేడాది అనుభవాలను దృష్టిలో ఉంచుకుని, మార్కెట్‌లో డిమాండ్ ఉన్న వరి రకాలను పండించేలా రైతులను ప్రోత్సహించాలని, దానికి అవసరమైన విత్తనాలను సరఫరా చేయనున్నామని చెప్పారు. వ్యవసాయ అధికారులు వ్యవసాయానుకూల ప్రాంతాలను సందర్శించి, వరిని తగ్గిస్తూ అధిక దిగుబడి, లాభాలను అర్జించే పంటల వైపు మళ్లించేలా అవగాహన కల్పించాలని సూచించారు.

గతానుభవాల దృష్ట్యా ముందుగానే అవసరమైన ఎరువులు, విత్తనాలను సిద్ధం చేశామని చెప్పారు. ఇప్పటికే రైతు భరోసా కేంద్రాలకు ఎరువులను పంపామని తెలిపారు. రైతులు జిల్లా, మండల కేంద్రానికి వెళ్లకుండా తమ గ్రామాలోని రైతుభరోసా కేంద్రంలోనే ఎరువులను కొనుగోలు చేసేలా సదుపాయాలను కల్పించాలని అధికారులను ఆదేశించారు. గతేడాది వ్యవసాయ అధికారులు వేసిన అంచనాలు సత్ఫలితాలను ఇచ్చాయని అభినందించారు. ధాన్యం కొనుగోలులో దళారులు లేకుండా నేరుగా రైతు ఖాతాలకే సకాలంలో డబ్బులు జమ చేశామని తెలిపారు. పంటను ప్రభుత్వం ప్రకటించిన ధరకు కొనుగోలు చేసి దళారీ వ్యవస్థ లేకుండా నిధులు మంజూరు చేసే ప్రక్రియ ఒక పద్ధతి ప్రకారం జరిగిందని మంత్రి స్పష్టం చేశారు. ఇందులో జిల్లా యంత్రాంగం, అధికారులు, దిగువ స్థాయి సిబ్బంది కృషి ప్రశంసనీయమన్నారు. రానున్న ఖరీఫ్ సీజన్‌లో సాగునీటి సమస్య లేకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. గొట్టాబ్యారేజీ రిజర్వాయర్ నిర్మించి సుమారు 50 సంవత్సరాలు దాటడంతో సహజంగా కొన్ని కట్టడాలు, కాలువలు దెబ్బతిన్నాయన్నారు. వాటిని శాశ్వత ప్రాతిపదికన పనులు చేపట్టేందుకు కొంత సమయం పట్టే అవకాశం ఉందని, అయితే ఈ సీజనుకు అవసరమైన నీటిని విడిచిపెట్టేందుకు దృష్టిసారించామని తెలిపారు. సాగునీటి పనుల కోసం కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ కొన్ని పనులు మంజూరు చేశారని, పిల్ల కాలువలు, ఇతర పనులను ఉపాధి హామీ నిధులతో చేపట్టనున్నట్లు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు

వర్షాలు కురవడంతో రబీలో ఈ ఏడాది 50 వేల ఎకరాలకు సాగు నీరందించామని, వచ్చే ఏడాది దీన్ని విస్తరించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. ఖరీఫ్‌లో శివారు భూములకు సాగునీరందించేలా చెరువులను నింపాలని సూచించారు. ఇరిగేషన్ అధికారులు సంబంధిత ఆయకట్టుదారులు, ఆ ప్రాంత ప్రతినిధులతో సాగునీటి సమస్యలపై చర్చించాలని చెప్పారు. సమావేశంలో ఎమ్మెల్యేలు ధర్మాన కృష్ణదాస్, రెడ్డి శాంతి, ఎమ్మెల్సీ నర్తు రామారావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ శిమ్మ నేతాజీ, జిల్లా నీటిపారుదల సలహా మండలి చైర్‌పర్సన్ చల్లా అలివేలు మంగ, రాష్ట్ర వ్యవసాయ మిషన్ సలహా మండలి సభ్యులు గొండు రఘురాం, కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, డిసిసిబి అధ్యక్షులు కె.రాజేశ్వరరావు, ముఖ్య ప్రణాళిక అధికారి వి.ఎస్.ఎస్. లక్ష్మీప్రసన్న, నీటి పారుదల, వ్యవసాయ సలహా మండలి సభ్యులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు

జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ అధికారులను ఆదేశించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన స్థాయీ సంఘ సమావేశాల్లో ఆమె మాట్లాడారు. ఉద్దాన ప్రాంతం, తీరప్రాంత గ్రామాల్లో నీటి ఎద్దడి తీవ్రత అధికంగా ఉంటోందన్నారు. ఈ సమయంలో ప్రజలకు తాగునీరు అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఉద్దాన ప్రాంతానికి తాగునీరు అందించేందుకు నిర్మాణంలో ఉన్న మెగా రక్షిత మంచినీటి పథకాన్ని ఎప్పట్లోగా పూర్తి చేస్తారని ప్రశ్నించారు. పనులు శరవేగంగా చేపడుతున్నట్లు ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఇ శ్రీనివాస ప్రసాద్ బదులిచ్చారు. నీటిఎద్దడి నివారణ చర్యలు చేపడుతున్నామని చెప్పారు. ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేసి పేదలకు సొంతింటి కల నెరవేర్చడంతో పాటు ప్రభుత్వ ప్రతిష్టను పెంచే విధంగా కృషి చేయాలని ఆమె చెప్పారు. కొన్నిచోట్ల ఉద్దేశపూర్వకంగా కొందరు అధికారులు బిల్లుల చెల్లింపులో జాప్యం చేస్తున్నట్లు వస్తున్న ఫిర్యాదులను పరిశీలించాలని పీడీని ఆదేశించారు. ప్రభుత్వ శాఖల్లో కార్యక్రమాలు చేపట్టడంతో పాటు ప్రజాప్రతినిధులను ఈ కార్యక్రమాల్లో భాగస్వాములను చేయాలన్నారు.



మాట్లాడుతున్న పిరియా విజయ

ఇంజినీరింగ్ శాఖల పనితీరుపై సమావేశంలో సమీక్షించారు. వేసవిలో కాలువల మరమ్మతులు చేపట్టం ద్వారా రానున్న ఖరీఫ్‌కు నీరందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆమదాలవలస నుంచి శ్రీకాకుళం వరకు రోడ్డు విస్తరణ పనులు ఎప్పటికి పూర్తి చేస్తారని ఆర్‌అండ్‌బి అధికారులను ప్రశ్నించారు. ఈ రోడ్డుపై ప్రయాణించే సమయంలో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. సమావేశాల్లో జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకట్రామన్, పలు శాఖల ఉన్నతాధికారులు, జెడ్‌పిటిసి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

తిట్టిన నోళ్లే పొగుడుతున్నాయి

- **దేశానికి ఆదర్శంగా నిలిచిన సచివాలయ వ్యవస్థ**
- **ప్రభుత్వ పథకాలకు వాలంటీర్లు అంబాసిడర్లు**
- **రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు**

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

వాలంటీరు వ్యవస్థను గతంలో తిట్టిన నోళ్లే ఇప్పుడు పొగుడుతున్నాయని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. నగరంలోని బాపూజీ కళా మందిర్‌లో వాలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఉత్తమ సేవలు అందించిన వాలంటీర్లను సత్కరించారు. ఈ సందర్భంగా ధర్మాన మాట్లాడుతూ గతంలో వాలంటీరు వ్యవస్థపై విమర్శలు చేసిన విపక్ష నేత చంద్రబాబే తాము అధికారంలోకొస్తే ఇదే వ్యవస్థను కొనసాగిస్తామని అంటున్నారని చెప్పారు. దళారీ వ్యవస్థ లేని సమాజం రావాలన్న ఆలోచనతోనే అవినీతి లేని వాలంటీరు వ్యవస్థను ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తీసుకొచ్చారని తెలిపారు. ముఖ్యమంత్రి ఆలోచనలకు అనుగుణంగా పారదర్శకంగా ప్రభుత్వ పథకాలు అందించడంలో వాలంటీర్లు గురుతర బాధ్యత పోషిస్తున్నారని చెప్పారు. విపక్షాల విమర్శలు పట్టించుకోకుండా వాలంటీర్లు ప్రజా సేవ చేస్తున్నారని అభినందించారు. వాలంటీరుకు సమాజంలో గౌరవం పెరిగిందన్నారు. వాలంటీరు వ్యవస్థ వల్లే ప్రభుత్వానికి మంచి పేరు వచ్చిందని తెలిపారు. ప్రభుత్వ పథకాలకు వాలంటీర్లే బ్రాండ్ అంబాసిడర్లు అని అన్నారు. ప్రభుత్వం నిర్దేశించుకున్న లక్ష్యాలు ఈ వ్యవస్థ వల్లే నెరవేరాయని చెప్పారు. అందువల్లే ప్రభుత్వం వాలంటీర్లకు పురస్కారాలను అందజేస్తోందన్నారు. సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు.

కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ మాట్లాడుతూ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించి అర్హత కలిగిన జాబితాను త్వరితగతిన రూపొందించడానికి సచివాలయ వ్యవస్థ కారణమన్నారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు అందించడంలో వాలంటీర్లు కీలకపాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. జిల్లాలో 11,216 మందికి సేవామిత్ర, 174 మందికి సేవారత్న, 40 మందికి సేవా వజ్ర, మొత్తం 11,430కి ఉగాది పురస్కారాలు అందించి సత్కరించేందుకు జిల్లా కమిటీ ఎంపిక చేసినట్లు తెలిపారు. జిల్లాలోని 30 మండలాల్లో 36 మందికి సేవా వజ్ర, 150 మందికి సేవా రత్న, 9,959 మందికి సేవా మిత్ర, నాలుగు మున్సిపాల్టీల్లో నలుగురికి సేవా వజ్ర, 24 మందికి సేవా రత్న, 1257 మందికి సేవా మిత్ర పురస్కారాలకు ఎంపికైనట్లు వివరించారు. ఒక బ్యాడ్జి, శాలువతో పాటు రూ.20 వేలు పారితోషికం అందించి సేవా రత్న పురస్కారంతో సత్కరించారు. ఏడాది పాటు ఎటువంటి ఫిర్యాదులు లేకుండా ప్రజల మెప్పు పొందిన 9617 గ్రామ, 1257 వార్డు వాలంటీర్ల సేవలను గుర్తించి సర్టిఫికెట్, బ్యాడ్జి, శాలువతో పాటు రూ.10 వేలు పారితోషికంతో సేవా మిత్ర పురస్కారం అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే రెడ్డి శాంతి, కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, తూర్పు కాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్, జెడ్‌పిటిసి సభ్యులు దివ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ మూకళ్ల తాతబాబు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.వి పద్మావతి, నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.



వాలంటీర్లను సత్కరిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

నేర నియంత్రణకు కృషి

ఎస్‌పి జి.ఆర్ రాధిక

ప్రజాశక్తి - శ్రీకాకుళం

నేర నియంత్రణకు కృషి చేయాలని పోలీసు అధికారులు, సిబ్బందికి ఎస్‌పి జి.ఆర్ రాధిక సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా శ్రీకాకుళం ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం సందర్శించి రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ముందుగా పోలీస్‌స్టేషన్ పరిసరాలను పరిశీలించి పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. రిసెప్షన్ కేంద్రం నిర్వహణ, ఫిర్యాదులకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేసి రికార్డుల నిర్వహణపై సంతృప్తి చెందారు. ముఖ్యమైన కేసులను పరిశీలించి, ఆయా కేసులపై ప్రత్యేక దృష్టిసారించి త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేయాలని ఆదేశించారు. దర్యాప్తు పూర్తి కాని కేసులపై ఆరా తీసి దర్యాప్తును వేగవంతం చేయాలన్నారు. ప్రతి కేసును సిసిటిఎన్‌ఎస్‌లో పొందుపరిచాలని ఆదేశించారు. పాత నేరస్తులపై నిఘా ఉంచాలన్నారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులు ముఖ్యంగా మహిళలపై మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. ప్రతిరోజూ సిబ్బంది పరిధిలోని వార్డు, గ్రామాల్లో సందర్శించి ప్రజలు, ముఖ్యంగా మహిళలపై జరుగుతున్న నేరాలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలపై దృష్టిసారించాలని సూచించారు. రాత్రిపూట గస్తీ పటిష్టంగా నిర్వహించి నేర నియంత్రణకు కృషి చేయాలన్నారు. తనిఖీల్లో డిఎస్‌పి వై.శృతి, రూరల్ సిఐ ఎల్.సన్యాసినాయుడు, ఎస్‌ఐలు గణేష్, ప్రవల్లిక, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్‌పి రాధిక

సమస్యల పరిష్కారానికి చొరవ చూపండి

ధర్మానకు ఎపి జెఎసి అమరావతి విజ్ఞప్తి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని ఎపి జెఎసి అమరావతి జిల్లా అధ్యక్షులు కె.శ్రీరాములు రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావును కోరారు. మూడో దశ ఉద్యమ కార్యాచరణలో భాగంగా ఉద్యోగుల వేదనను చెబుదాంలో భాగంగా పెద్దపాడులోని క్యాంపు కార్యాలయంలో మంత్రిని శుక్రవారం కలిసి ఉద్యోగుల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ప్రతి నెలా ఒకటో తేదీన ఉద్యోగులకు జీతాలు, పెన్షనర్లకు పెన్షన్ ఇచ్చే వారని, కొంతకాలంగా సకాలంలో జీతాలు అందక ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని మంత్రికి వివరించారు. 2018 జులై నుంచి పెండింగ్‌లో ఉన్న నాలుగు డిఎ ఎరియర్స్‌ను వెంటనే చెల్లించాలని కోరారు. 11వ పిఆర్‌సి కమిషన్ రికమెండ్ చేసిన పే స్కేల్స్ వెంటనే విడుదల చేయడంతో పాటు అరియర్స్‌ను విడుదల చేయాలన్నారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు సిపిఎస్‌ను రద్దు చేసి, ఒపిఎస్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయడంతో పాటు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలు పెంచాలన్నారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో జెఎసి అసోసియేట్ చైర్మన్ పి.లక్ష్మణరావు, మహిళా విభాగం చైర్మన్ కె.ప్రవల్లికాప్రియ, ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.వేణుగోపాలరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి పి.శ్రీనివాసరావు, దిలీప్ చక్రవర్తి, కార్యదర్శి బి.వి.వి.ఎన్. రాజు తదితరులు పాల్గొన్నారు.



మంత్రి ధర్మానకు వినతిపత్రం ఇస్తున్న జెఎసి నాయకులు

'ఉపాధి' కూలీలకు వంద రోజుల పని

ప్రజాశక్తి - కోటబొమ్మాళి

జాబ్‌కార్డు కలిగిన ఉపాధి కూలీలకు వంద రోజుల పని దినాలు కల్పించడమే లక్ష్యంగా పనులను గుర్తించినట్లు డ్వామా పీడీ జి.వి చిట్టిరాజు తెలిపారు. మండలంలోని హరిశ్చంద్రపురం పంచాయతీలో చేపడుతున్న ఉపాధి హామీ పనులను శుక్రవారం పరిశీలించారు. మొక్కల పరిరక్షణకు అవసరమైన చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. గట్టును వెడల్పు చేయడం, బెంచింగ్ పనులు చేయడంతో పాటు పార్కును తలపించే ఆహ్లాదకరమైన వాతావరణాన్ని గ్రామస్తులకు అందించాలన్నారు.

కూలీలకు గరిష్ట కూలి అందేలా సిబ్బంది దృష్టిసారించాలని సూచించారు. ఉపాధి హామీలో జాతీయస్థాయిలో జిల్లాను మొదటి స్థానంలో ఉంచేందుకు కూలీలు తమ వంతు సహకారాన్ని అందించాలని కోరారు. నాణ్యతతో కూడిన పనులు చేయడం వల్ల వాటి ఫలితాలు గ్రామీణ ప్రజలు అందరికీ అందుతాయని చెప్పారు. కార్యక్రమంలో ఎపిడిలు లోకేశ్వరరావు, మురళీకృష్ణ, ఎపిఒ జి.హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు గురుకుల పాఠశాలల్లో ప్రవేశ పరీక్ష

శ్రీకాకుళం అర్బన్ : ఎపి గురుకుల విద్యాలయ సంస్థ ఆధ్వర్యాన గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో ప్రవేశాలకు ఈనెల 20న ప్రవేశ పరీక్షను నిర్వహించనున్నట్లు గురుకుల పాఠశాలల జిల్లా సమన్వయకర్త పి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. 2023-24 విద్యా సంవత్సరంలో 5, 6, 7, 8 తరగతుల్లో ప్రవేశానికి ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఇంటర్, డిగ్రీ ప్రవేశాలకు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకూ పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణకు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. పరీక్షా కేంద్రాల వివరాలను హాల్ టిక్కెట్‌లో పొందుపరిచినట్లు పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు పరీక్షా కేంద్రానికి నిర్దేశించిన సమయానికి గంట ముందు హాజరు కావాలని తెలిపారు. https://aprs.apcfss.in వెబ్‌సైట్ నుంచి హాల్ టిక్కెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

ఇకెవైసికి నేడు ఆఖరు

శ్రీకాకుళం : జిల్లాలోని 12 ఉప ఖజానా కార్యాలయాల ద్వారా జీతాలు, పెన్షన్ తీసుకుంటున్న ఉద్యోగులు, పింఛనుదారులు సిఎఫ్‌ఎంఎస్ ఐడి నంబరుతో ఆధార్ నంబరును ఇకెవైసి చేయించాలని జిల్లా ఖజానా శాఖ ఉప సంచాలకులు సిహెచ్.రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. డిడిఒలు కార్యాలయ చిరునామాను హెర్బ్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. జిల్లావ్యాప్తంగా ఇప్పటివరకు 56 శాతం మంది పెన్షనర్లు మాత్రమే ఇకెవైసి నమోదు చేసుకున్నారని, మిగిలిన వారు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని కోరారు. పెన్షన్ పొందడానికి ఎటువంటి ఆటంకం లేకుండా ఉండేందుకు వీలుగా లింక్ చేయడం తప్పనిసరి అని స్పష్టం చేశారు. హెర్బ్ యాప్ ద్వారా గానీ పెన్షన్ పొందుతున్న ఉప ఖజానా కార్యాలయంలో గానీ ఇకెవైసి చేయించుకోవాలని కోరారు. జిల్లాలో 500 మందికి పైగా పింఛన్‌దారులు లైఫ్ సర్టిఫికెట్ సమర్పించకపోవడంతో ఏప్రిల్ పింఛన్‌ను నిలుపుదల చేసినట్లు తెలిపారు. తక్షణమే లైఫ్ సర్టిఫికేట్‌ను సమర్పించాలని కోరారు. ఆశావర్కర్లు, అంగన్వాడీలు, అవుట్‌సోర్సింగ్, విఆర్‌ఎ, డైలీ వేజ్, హోంగార్డులు తదితరులు ఈనెల 20వ తేదీ లోగా సిఎఫ్‌ఎంఎస్ ఐడి, ఆధార్ లింక్ చేసుకోవాలని తెలిపారు.

ప్రజా సమస్యలపై సమరశీల పోరాటాలు

- **అదే సుందరయ్యకు ఇచ్చే ఘన నివాళి**
- **దేశ సంపదను కార్పొరేట్లకు ధారాదత్తం చేస్తున్న బిజెపి ప్రభుత్వం**
- **సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్**
- **పలుచోట్ల పుచ్చలపల్లి సుందరయ్య 38వ వర్ధంతి సభలు**

ప్రజాశక్తి - శ్రీకాకుళం యంత్రాంగం

ప్రజా సమస్యలపై సమరశీల పోరాటాలు చేయడమే సుందరయ్యకు ఇచ్చే ఘన నివాళి అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్ అన్నారు. దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య 38వ వర్ధంతి సభలను జిల్లాలోని పలుచోట్ల శుక్రవారం నిర్వహించారు. సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఇందులో భాగంగా కోటబొమ్మాళిలోని ఒక కళ్యాణ మండపంలో సిపిఎం మండల నాయకులు హనుమంతు ఈశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన సుందరయ్య వర్ధంతి సభలో ఆయన ప్రసంగించారు. తన జీవితాన్ని ప్రజలకు అంకితం చేసిన మహా యోధుడు సుందరయ్య అని కొనియాడారు. ప్రజా సమస్యలపై అనేక ఉద్యమాలు నిర్మించారని గుర్తుచేశారు. సుందరయ్య జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. ఆయన పోరాట స్ఫూర్తితో ప్రజా సమస్యలు, ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

దేశ సంపద కార్పొరేట్లకు ధారాదత్తం

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజల ఆస్తులు, ప్రకృతి వనరులను అదానీ, అంబానీ ఆస్తిగా మార్చేస్తోందని విమర్శించారు. ప్రజల సంపదతో నిర్మితమైన బ్యాంకులు, రోడ్లు, రైల్వే, బిఎస్ఎన్ఎల్, పోర్టులు, స్టీల్‌ప్లాంట్ తదితర ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్లకు ధారాదత్తం చేస్తోందన్నారు. బిజెపి విధానాలను రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం మరింత ముందుకు తీసుకెళ్తోందని విమర్శించారు. మూలపేట పోర్టు పేరుతో రాష్ట్ర ప్రభుత్వం 6,470 ఎకరాలను అదానీకి కట్టబెట్టిందని తెలిపారు. రాష్ట్రంలోని వైసిపి, టిడిపి, జనసేన రాష్ట్రానికి ద్రోహం చేసిన బిజెపికి భజన చేస్తున్నాయని విమర్శించారు. విభజన హామీలు, ప్రత్యేక హోదా అమలు చేయని బిజెపికి వ్యతిరేకంగా ఆ పార్టీలు ఎందుకు ప్రశ్నించడం లేదని ఆయన ప్రశ్నించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, జిల్లా కమిటీ సభ్యులు ఎన్.షణ్ముఖరావు మాట్లాడుతూ కార్యక్రమంలో సిఐటియు నాయకులు గొండు నీలన్న, సన్యాసి, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు తులసీదాస్

సిపిఎం జిల్లా కార్యాలయంలో...

సుందరయ్య జీవితం నేటి తరానికి ఆదర్శమని సిపిఎం సీనియర్ నాయకులు సత్తారు.భాస్కరరావు అన్నారు. శ్రీకాకుళం నగరంలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో సుందరయ్య 38వ వర్ధంతి సభను పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.మోహనరావు అధ్యక్షతన నిర్వహించారు. సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుందరయ్య నిబద్ధత కలిగిన సామాజిక, ఆర్థిక, రాజకీయ పోరాటాలను నడిపారని చెప్పారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భవిరి కృష్ణమూర్తి మాట్లాడుతూ మత, ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొడుతున్న బిజెపికి వ్యతిరేకంగా ప్రజలంతా కలిసి పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కొత్తకోట అప్పారావు, ఎం.ప్రభాకరరావు, కె.సూరయ్య, జె.జ్యోతీశ్వరరావు, పి.తేజేశ్వరరావు, కె.చంద్రశేఖరరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు తులసీదాస్

నగరంలోని ఎన్‌జిఒ హోంలో నిర్వహించిన సుందరయ్య వర్ధంతి సభలో సిపిఎం నగర కన్వీనర్ టి.తిరుపతిరావు, బొడ్డేపల్లి మోహనరావు, కె.సూరయ్య, బొడ్డేపల్లి మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

రణస్థలంలో...

సోషలిజంతోనే సమ సమాజం సాధ్యమవుతుందని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు, జిల్లా కార్యదర్శి కె.గురునాయుడు కౌలురైతుల సంఘం జిల్లా అధ్యక్షులు వెలమల.రమణ అన్నారు. రణస్థలం మండలం పైడిభీమవరంలోని సిఐటియు కార్యాలయంలో సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో గొర్లె కృష్ణ, ఎస్.రాజాబాబు, బాల, మురళి తదితరులు పాల్గొన్నారు.
ప్రజా సమస్యలపై నిత్యము పోరాడిన యోధుడు.

టెక్కలిలో...

సిఐటియు కార్యాలయంలో సుందరయ్య చిత్రపటానికి సిపిఎం నాయకులు నంబూరు షణ్ముఖరావు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కొల్లి ఎల్లయ్య, బగాది వాసుదేవరావు, సిఐటియు నాయకులు హనుమంతు ఈశ్వరరావు, ఉరజాన దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పలాసలో...

కాశీబుగ్గలోని సిపిఎం కార్యాలయంలో సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎన్.గణపతి, యుటిఎఫ్ నాయకులు బి.ఓంకార్, ప్రజాసంఘాల నాయకులు టి.అజయ్ కుమార్, ఐద్వా నాయకులు ఎన్.ఢిల్లేశ్వరి, జె.భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. సిఐటియు కార్యాలయంలో సుందరయ్య చిత్రపటానికి ప్రజాశక్తి సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ ఎ.సోమశేఖర్, యాడ్స్ జిల్లా ఇన్‌ఛార్జి టి.బుజ్జిబాబు, విలేకరులు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

ఎచ్చెర్లలో...

చిలకపాలెంలో సుందరయ్య చిత్రపటానికి సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టి.నందోడు, కోరాడ.అప్పన్న, రేగాన సింహాద్రి, రేగాన కృష్ణ, కె.దమయంతి తదితరులు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరులో...

నగరంపల్లి, పాతటెక్కలి, కూర్మనాథపురంలో సుందరయ్య వర్ధంతి సభలు నిర్వహించారు. సిపిఎం సీనియర్ నాయకులు బమ్మిడి శ్రీరాములు సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు బమ్మిడి ఆనందరావు, ఎన్.మోహనరావు, చంద్రయ్య, టి.భాస్కరరావు, ఎన్.భైరాగి దుబ్బ భాస్కరరావు, చింత దాలయ్య తదితరులు పాల్గొన్నారు.

సోంపేటలో...

మామిడిపల్లిలో సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు తెప్పల పాపారావు, పి.ముకుందరావు, గేదెల పురుషోత్తం, టి.రామారావు, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరులో...

మెట్టూరుగూడలో గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు నిమ్మక అప్పన్న అధ్యక్షతన నిర్వహించిన సుందరయ్య వర్ధంతి సభలో జె.ప్రకాష్, చరణ్, ఎల్.ఫల్గుణరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి కార్యాలయంలో...

సుందరయ్య స్ఫూర్తితో ప్రజాశక్తి అభివృద్ధిలో ఉద్యోగులంతా భాగస్వామ్యం కావాలని ప్రజాశక్తి శ్రీకాకుళం ఎడిషన్ మేనేజర్ పి.కామినాయుడు పిలుపునిచ్చారు. ఎచ్చెర్ల మండలం కుశాలపురం ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని ప్రజాశక్తి ఎడిషన్ కార్యాలయంలో సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. సర్క్యులేషన్ ఎగ్జిక్యూటివ్ బి.సింహాచలం అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో స్టాఫ్ రిపోర్టర్ టి.భీమారావు, ఉద్యోగులు, విలేకరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

సుందరయ్య వర్ధంతిని పురస్కరించుకుని కంచిలి మండలం బూరగాంలో ప్రజాసంఘాలు, జై భీమ్ చైతన్య సేవా సంఘం ఆధ్వర్యాన రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. గ్రామానికి చెందిన పలువురు యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు కె.గోపీనాథ్, సంగారు లక్ష్మీనారాయణ, కొక్కిరి రాజు, వల్లభరావు, సర్పంచ్ ప్రతినిధి మద్దు అప్పారావు, జై భీమ్ చైతన్య సేవా సంఘం సభ్యులు గంగారావు, గాంధీ, సత్యం, మన్మథరావు తదితరులు పాల్గొన్నారు.




రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న రవికుమార్, గుండ దంపతులు

ప్రజాదరణ 'నందమూరి' సొంతం

టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

తెలుగు జాతి గర్వించదగ్గ నటులు నందమూరి వంశం నుంచే పుట్టుకొచ్చారని, నందమూర్తి తారక రామారావు మొదలు మోక్షజ్ఞ వరకు అందరికీ ప్రేక్షకాదరణ ఉందని టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ అన్నారు. జూనియర్ ఎన్‌టిఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని నగరంలోని శ్రీఫంక్షన్ హాల్లో ఆయన అభిమానులు శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. 120 మంది యువకులు పాల్గొనిర క్తదానం చేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, అనంతరం రాగోలు జెమ్స్ ఆస్పత్రి సహకారంతో వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య పరీక్షలు చేపట్టి రోగులకు ఉచితంగా మందులను అందజేశారు. న్యూ బ్లడ్ బ్యాంకు తరుపున డేవిడ్ టీం, మణికంఠ దుశ్శాలువ కప్పి సన్మానించి మెమోంటోలు అందజేశారు. కార్యక్రమంలో అభిమాన సంఘాల ప్రతినిధులు బరాటం ఉదయ్ శంకర్ గుప్తా, మాదారపు వెంకటేష్, కేశవ రాంబాబు, గొర్లె వెంకటరమణ, కార్యదర్శి సురకాసి వెంకటరావు, జిల్లా ట్రెజరీ డిపార్ట్‌మెంట్ నాయకులు బెండి మోహన్, మంత్రి వెంకటస్వామి పాల్గొన్నారు.

రణస్థలం : జూనియర్ ఎన్‌టిఆర్ పుట్టిన రోజు సందర్భంగా జీరుపాలెం టీమ్ తారక్ ట్రస్టు సభ్యులు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. 113 యూనిట్లు రక్తాన్ని సేకరించారు. అలాగే 200 మొక్కలు నాటారు. భారీ అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

ఆలయ అభివృద్ధికి ఆర్థికసాయం

పలాస : పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ 10వ వార్డు పారసాంబలో నూతనంగా నిర్మిస్తున్న ముత్యాల పోలమ్మ గ్రామదేవత ఆలయ అభివృద్ధికి వార్డు కౌన్సిలర్ గీత రూ.పది వేలు ఆర్థికసాయాన్ని నిర్వహకులకు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి కృషి చేస్తున్నానని, ప్రజలు సహకరించాలని కోరారు. పదో ఆర్థిక సంఘం నిధులతో ఆలయం వరకు సిసి రోడ్డు నిర్మాణానికి టెండరు ప్రక్రియ పూర్తయిందన్నారు. త్వరలో పనులు ప్రారంభిస్తారని తెలిపారు. ఆలయ నిర్మాణ పనులకు దాతలు సహకరించాలని కోరారు.


ఆర్థికసాయం అందజేస్తున్న కౌన్సిలర్ గీత

ఎపి మోడల్‌లో ఇంటర్‌కు

దరఖాస్తుల ఆహ్వానం

పోలాకి: ఈ నెల 22 నుంచి మండలంలోని ఈదులవలస ఎపి మోడల్ కళాశాలలో ఇంటర్మీడియెట్‌లో చేరేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ పైడి ప్రవీణ తెలిపారు. కళాశాలలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ఈ ఏడాది పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఎపిఎంఎస్.ఎపి.జిఒవి.ఇన్ (apms.ap.gov.in) వెబ్‌సైట్‌లో అప్లై చేయాలని సూచించారు. తమ కళాశాలలో ఎంపిసి, బైపిసి, ఎంఇసి, సిఇసి గ్రూపులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులు రూ.150, ఓసి ,బిసి విద్యార్థులు రూ.200 ఫీజు చెలిలించాలని కోరారు. మరిన్ని వివరాలకు 9652730073, 8317687560 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఇచ్ఛాపురం : మండలంలోని పురుషోత్తమపురంలో ఉన్న ఎపి మోడల్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ జి.శివప్రసాద్ ఒక ప్రకటలో తెలిపారు. పదో తరగతి ఫలితాల్లో వచ్చిన మెరిట్ మార్కుల ఆధారంగా రిజర్వేషన్ ద్వారా సీట్లు కేటాయించామన్నారు. ఈ నెల 22 నుంచి జూన్ 7 వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని తెలిపారు. బాలికలకు హాస్టల్ సదుపాయం ఉందన్నారు.

బూర్జ : మండలంలోని ఓ.వి.పేట ఎపి మోడల్ స్కూల్ అండ్ జూనియర్ కాలేజ్‌లో ఇంటర్మీడియట్ ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు https://apms.ap.gov.in/apmsలో అప్లై చేసుకోవాలని కోరారు.

కవిటి: మండలంలోని రాజపురం ఎపి మోడల్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ ఎం.ఈశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే ఆరో తరగతి ప్రవేశానికీ దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. మెరిట్ ఆధారంగా జరుగుతున్న ఈ ప్రవేశాలు పూర్తి పారదర్శకంగా నిర్వహిస్తున్నామని, అర్హత కలిగిన అభ్యర్థులు సంబంధిత ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

జి.సిగడాం : మండల కేంద్రంలోని ఎపి మోడల్ కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రవేశానికి దరఖాస్తులు ఆన్‌లైలో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ అన్నా శామ్యూల్ లంక ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతిలో వచ్చిన మార్కులు ప్రాతిపదికన ప్రవేశాలు కల్పిస్తామని తెలిపారు.


పలాస : అవస్థలు పడుతున్న వాహనదారులు


జి.సిగడాం : నేలరాలిన మామిడికాయలను చూపిస్తున్న రైతు

ఈదురుగాలులతో వర్షం

ప్రజాశక్తి- జిల్లా విలేకరుల యంత్రాంగం

జిల్లాలోని రణస్థలం, లావేరు, జి.సిగడాం, ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి మండలాల్లో ఈదురు గాలులుతో పాటుగా వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండవేడిమికి అల్లాడిపోయారు. సాయంత్రం ఒక్కసారిగా మేఘావృతమై కారు మబ్బులు అలుముకున్నాయి. హోరు గాలులు వీయడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. అనంతరం వర్షం కురిసింది. దీంతో చల్లదనం కావడంతో ఉపశమనం లభించింది. పలాస వీధులు, ప్రధాన రహదారిపై వర్షపునీరు నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో సిమ్మచీకట్లో మగ్గుతున్నారు. అలాగే జి.సిగడాం మండలం బూటుపేటకు చెందిన గొర్లె లక్ష్మంనాయుడు ఐదెకరాల్లో మామిడి తోట పెంచారు. రూ.లక్ష వరకు పెట్టుబడి పెట్టారు. కాయలు చేతికొచ్చే సమయానికి ఈదురు గాలులు, వాన బీభత్సం సృష్టించడంతో కాయలు రాలిపోయాయి. మచ్చలు రావడంతో కొనుగోలుకు ముందుకు రారని వాపోయారు. పెట్టుబడి కోసం చేసిన అప్పు ఎలా తీర్చాలంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ భారీ వర్షం ఖరీఫ్ వ్యవసాయానికి ఎంతగానో మేలుచేకూరుతుందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

అందుబాటులో వరి విత్తనాలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నైర వ్యవసాయ కళాశాల ఆధ్వర్యాన ఉత్పత్తి చేస్తున్న వివిధ రకాలైన ఫౌండేషన్ విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచినట్టు కళాశాల డీన్ డాక్టర్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. రైతు స్థాయిలో విత్తనోత్పత్తి చేయడానికి అవసరమైన వరి నాణ్యమైన మూల విత్తనం అవసరమని, అందులో భాగంగా ఈ విత్తనాలను సిద్ధం చేశామని అన్నారు. అత్యధిక

అందుబాటులో ఉన్న విత్తన రకాలు

వరి రకం	బరువు	ధర
సాంబమసూరి (బిపిటి 5204)	30 కేజీల బస్తా	రూ.1200
స్వర్ణ (ఎంటియు)7029	30 కేజీల బస్తా	రూ.1050
ఎంటియు 1121 (శ్రీధృతి)	30 కేజీల బస్తా	రూ.1050
ఎంటియు1224 (ఎం.సాంబ)	30 కేజీల బస్తా	రూ.1050
ఎంటియు1210 (సుజాత)	30 కేజీల బస్తా	రూ.1050
ఎంటియు1061 (ఇంద్ర)	30 కేజీల బస్తా	రూ.1050
ఎంటియు1064 (అమర)	30 కేజీల బస్తా	రూ.1050
ఎంటియు1318 (ప్రీ రిలీజ్)	30 కేజీల బస్తా	రూ.1050



నైర కళాశాల

జన్యు స్వచ్ఛత (99 శాతం), భౌతిక స్వచ్ఛత (98 శాతం), మొలక (80-100 శాతం), నిర్ధేశింపబడిన తేమ శాతం (11-13శాతం) ఉండే విత్తనాలను ఈ నెల 25 నుంచి విక్రయానికి సిద్ధంగా ఉంచినట్లు పేర్కొన్నారు. రైతులు ఫౌండేషన్ విత్తనం ద్వారా మూడు సీజన్ల వరకు పండిన పంట క్షేత్రంలో వాళ్లంతట వారే విత్తనాన్ని తయారు చేసుకొని వినియోగించడం ద్వారా అధిక దిగుబడిని పొందవచ్చన్నారు. ఈ విత్తనం వాడకం ద్వారా సాధారణ పంట కన్న 10 నుంచి 20 శాతం అధిక దిగుబడిని పొందవచ్చన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

నందిగాం : రాష్ట్ర ప్రభుత్వం విద్యపై చూపుతున్న శ్రద్ధలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యతో పాటు, విద్యార్థులకు అనువైన బోధన ఉంటుందని లఖిదాసుపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రదానోపాధ్యాయులు చిలుకు కృష్ణారావు అన్నారు. విద్యాశాఖ ఆదేశాల మేరకు శుక్రవారం లింగాలపాడు, దిమిలాడ గ్రామాల్లో విద్యార్థులను, వారి తల్లిదండ్రులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. అనంతరం ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా పథకాలను వివరించారు. కార్యక్రమంలో దిమిలాడ సర్పంచ్ బొంగి హనుమంతరావు, ఉపాధ్యాయులు తులసీప్రసాద్, రంకిణి రామారావు, బెందాళం రత్నం, యాగాటి త్రినాథరావు పాల్గొన్నారు.


పాఠశాలలో చేరిన విద్యార్థులు


ఆర్థికసాయం అందిస్తున్న జగన్నాథ్ మెలోడీ గ్రూప్ సభ్యులు

రామారావు వైద్యానికి సాయం

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

కవిటి: 'ఆ పాటకు ప్రాణం పోద్దాం' అంటూ ఈ నెల 15న ప్రజాశక్తిలో వచ్చిన కథనానికి దాతలు, స్వచ్ఛంద సంస్థలు ఉదారంగా స్పందిస్తున్నాయి. సోమవారం నుంచే తన ఫోన్ పే నంబరుకు దాతలు ఆర్థిక సాయం అందిస్తున్నారని, అలాగే పలు స్వచ్ఛంద సంస్థలు, తన చిన్ననాటి స్నేహితులు, తెలిసిన వాళ్లు, తోటి కళాకారులు తన వైద్యం కోసం నగదు సేకరిస్తున్నట్లు తెలిపారని బోన్ కేన్సర్‌తో బాధపడుతున్న మండలంలోని కొమ్ముపుట్టుగకు చెందిన తోట రామారావు తెలిపారు. అదే విధంగా ప్రధానపుట్టుగకు చెందిన జగన్నాథ్ మెలోడీ గ్రూప్ సభ్యులు తన వైద్యం కోసం రూ.ఎనిమిది వేలు అందించినట్లు తెలిపారు. బోన్ కేన్సర్‌తో బాధపడుతూ, వైద్యం కోసం దిక్కుతోచని స్థితిలో ఉన్న తనకు ఇతమంది సహాయ సహకారాలు అందించేలా చేసిన ప్రజాశక్తికి ఈ సందర్భంగా రామారావు కృతజ్ఞతలు తెలిపారు.

'ఉపాధి' నిధులు పక్కదారిపై విచారణ


విచారణ చేస్తున్న ఎపిడి మురళీకృష్ణ

ప్రజాశక్తి- నౌపడ

సంతబొమ్మాళి మండలం నవపడ పంచాయతీలో ఉపాధి హామీ నిధులు ఫీల్డ్ అసిస్టెంట్లు ప్రసాద్‌రెడ్డి, బి.రామారావు పక్కదారి పట్టించిన వ్యవహారంపై డ్వామా ఎపిడి మురళీకృష్ణ శుక్రవారం విచారణ చేపట్టారు. ఈ మేరకు నౌపడ సచివాలయం, సీతానగరంలో లబ్ధిదారులతో మాట్లాడారు. ఉపాధి హామీ పనులకు వెళ్లని వారికి, ఉద్యోగస్తులకు, విదేశాల్లో ఉన్న వారికి ఫీల్డ్ అసిస్టెంట్లు మస్టర్లు వేసి నిధులు జమ చేయడంపై పత్రికల్లో వరుస కథనాలు రావడంతో సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి విచారణకు ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎపిడి ప్రచారణ చేసి స్టేట్‌మెంట్ నమోదు చేశారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎపిఒ వాసునాయుడు, సర్పంచ్ ప్రతినిధి పిలక రవి కుమార్‌రెడ్డి, ఇసి మునేంద్ర, కార్యదర్శి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న దుర్యోధన

అభివృద్ధిపై చర్చకు సిద్ధం

ప్రజాశక్తి- మందస/పలాస

ఆరవై ఏళ్లలో ఈ ప్రాంతంలో గౌతు కుటుంబం చేసిన అభివృద్ధి, మౌలిక సదుపాయాలపై మేము చర్చలకు సిద్ధం, మీరు సిద్ధంగా ఉన్నారా అంటూ వైసిపి నాయకులకు టిడిపి నాయకులు సవాళ్లు విసిరారు. మందస మండలం హరిపురం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షులు భావన దుర్యోధన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర మంత్రి స్థాయిలో ఉన్న అప్పలరాజు జీడీ రైతాంగానికి ఎందుకు మద్దతు ధర కల్పించలేకపోయారని ప్రశ్నించారు. జంతిబంధ రిజర్వాయరు, దామోదర్ సాగర్ కుడి కాలువ పూర్తి చేసి మాట్లాడాలని హితవుపలికారు. తిత్లీ రెట్టింపు పరిహారం ఎప్పుడు చెల్లిస్తారని ప్రశ్నించారు. బంజరి కేశుపురం, పింపిడియా, పరిగాసాయి గ్రామాలకు రోడ్లు ఎప్పటిలోగా పూర్తి చేస్తారో చెప్పగలరా? అని ప్రశ్నించారు. పుచ్చపాడుకు బ్రిడ్జి నిర్మించే ఆలోచన ఉందా అని ప్రశ్నించారు. కిడ్నీ వ్యాధిగ్రస్తుల కోసం ఏర్పాటు చేసిన ఎన్‌టిఆర్ సుజల తాగునీటి పథకాన్ని నిర్వీర్యం చేశారా? లేదా? అన్ని ప్రశ్నించారు. పలాసలో గతంలో 18 మండలాలకు సంబంధించి గ్రామీణ తాగునీటి సరఫరా విభాగం ప్రధాన కార్యాలయం ఉండేదని, ఇప్పుడు ఆ కార్యాలయం అనకాపల్లికి వెళ్లిపోయిందని, దానిపై మీరు ఎందుకు మాట్లాడటం లేదని అన్నారు. ఈ నాలుగేళ్ల మీ పాలనలో ఒక్క సాగునీటి ప్రాజెక్టు, ఒక్క చెరువు, సాగునీటి కాలువలో పూడిక తీశారా? అని చెప్పాలంటూ ప్రశ్నించారు. మందస, హరిపురంలో సెంటర్ లైటింగ్ హామీ ఏమైందని ప్రశ్నించారు. సమావేశంలో టిడిపి నాయకులు దాసరి తాతారావు, బమ్మిడి కర్రయ్య, రట్టి లింగరాజు, లబ్బ రుద్రయ్య, బైరిశెట్టి గున్నయ్య, సిర్ల కృష్ణారావు పాల్గొన్నారు.


విచారణ చేస్తున్న సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి

భూ వివాదంపై విచారణ

టెక్కలి :కోటబొమ్మాళి మండలం జియ్యన్నపేట వద్ద ఉన్న సర్వే నంబరు ఒకటిలో చోటుచేసుకున్న భూ వివాదంపై సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి శుక్రవారం విచారణ చేపట్టారు. భూమికి సంబంధించిన వివరాలు నమోదులోను, రికార్డులు మార్పుపై, రెవెన్యూ అధికారులపై రైతులు పిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు రెవెన్యూ అధికారులతో, రైతులతో వేర్వేరుగా విచారణ చేపట్టారు. ఈ విచారణలో ఇరు పక్షాల వాదనలను సబ్ కలెక్టర్ నమోదు చేశారు.

ఆదాయపు పన్ను ఇన్‌స్పెక్టర్ పోస్టుకు సాయిసురేష్ ఎంపిక


సాయి సురేష్

సరుబుజ్జిలి : మండలంలోని కూన జమ్మన్నపేటకు చెందిన సనపల సాయి సురేష్ ఇటీవల వెలువడిన స్టాఫ్ సెలక్షన్ కమిషన్ కమిషన్ గ్రాంట్ లెవెల్ పరీక్ష ఫలితాల్లో గ్రేడ్-2 కేటగిరీకి చెందిన ఇన్‌కమ్ టాక్స్ ఇన్‌స్పెక్టర్ పోస్టుకు ఎంపికయ్యారు. ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ (ఇసిఇ)లో బీటెక్‌ను పూర్తి చేశారు. ఈయన తల్లిదండ్రులు మిన్నారావు, రమణమ్మలు వ్యవసాయ కూలీలు. పదో తరగతి వరకు సరుబుజ్జిలి మండల కేంద్రంలోని శ్రీవెంకట సాయి స్కూల్ లో విద్యను అభ్యసించారు. సాయి సురేష్ ప్రజాశక్తితో మాట్లాడుతూ తన చిరకాల వాంఛ లక్ష్యమైన ఇన్‌కమ్ టాక్స్ ఇన్‌స్పెక్టర్ పోస్టుకు ఎంపిక కావడం గర్వకారణంగా ఉందన్నారు.

పేదలంటే చంద్రబాబుకు అంత చులకనా?

ప్రజాశక్తి- జలుమూరు

పేదలంటే మాజీ సిఎం చంద్రబాబుకు అంత చులకనా? అనిఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ మండిపడ్డారు. మండలంలోని చల్లవానిపేట జగనన్న లేఅవుట్‌లో శుక్రవారం లబ్ధిదారులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధికారంలో ఉన్నా.. ప్రతిపక్షంలో ఉన్నా.. పేదల సంక్షేమం చంద్రబాబుకి పట్టదన్నారు. పేదలకు ఇచ్చే సెంటు స్థలం.. వారు చనిపోయాక సమాధులు కట్టుకోవడానికి పనికొస్తుందంటూ చంద్రబాబు అనుచిత వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమన్నారు. పేదలంటే చంద్రబాబుకి ఎందుకంత చులకన భావం అని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఎంపిపి


నిరసనలో పాల్గొన్న ఎమ్మెల్యే కృష్ణదాస్

వాన గోపి, మండల వైసిపి కన్వీనర్ కనుసు సీతారాం, చల్లవానిపేట, అల్లాడ పిఎసిఎస్ అధ్యక్షులు పాగోటి రాజప్పలనాయుడు, మొజ్జాడ శ్యామలరావు, మండల సలహాదారుడు పైడి విఠల్‌రావు, వైస్ ఎంపిపిలు తంగి మురళీకృష్ణ, డోల నాగరత్నం పాల్గొన్నారు.

జీడి వ్యాపారుల అత్యవసర సమావేశం

ప్రజాశక్తి- పలాస

కాశీబుగ్గ ఇంగిలిగాం పారిశ్రామికవాడ జీడి వ్యాపారుల సంఘం నాయకులు శుక్రవారం రాత్రి అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సంఘ అధ్యక్షుడు మల్లా రామేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కార్యదర్శి తూముల శ్రీనివాసరావు, కోశాధికారి శాసనపురి శ్రీనివాస్, వ్యాపారులు పాల్గొన్నారు. కాలుష్య నియంత్రణ మండలి అధికారులు కాలలష్యం తగ్గించాలని నోటీసులు ఇచ్చిన


చర్చిస్తున్న వ్యాపారస్తులు

నేపథ్యంలో వ్యాపారులు అత్యవసర సమావేశం. నిర్వహించి భవిష్యత్ కార్యక్రమాలపై చర్చించారు. పరిశ్రమలు మూతవేసే పరిస్థితి వస్తే ఏవిధంగా స్పందించాలన్న విషయంపై చర్చించారు. దీంతో పాటుగా కార్మికుల వేతనాలు, కొత్త పారిశ్రామికవాడలో పరిశ్రమల సముదాయలపై చర్చించారు. కాలుష్యం సమస్యపై రాష్ట్ర మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు దృష్టికి తీసుకెళ్లి సామరస్యంగా పరిష్కరించుకోవడానికి నిర్ణయించారు.

నీటి సరఫరాలో స్వల్ప మార్పులు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

పట్టణంలో తాగునీరు సరఫరా చేసే మోటర్లు రెండు మరమ్మతులు గురి కావడంతో నీటి సరఫరాలో స్వల్ప మార్పులు చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. రోజూ వారి నీటి సరఫరా చేసే మూడు మోటర్లలో రెండు మొరయించడంతో కేవలం ఒక మోటర్ ద్వార నీరు అందించాల్సి వస్తోందని అన్నారు. ప్రజలు గమనించి నీటిని వృథా చేయకుండా సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శనివారం నుంచి మోటార్లు బాగు చేసే వరకూ రోజు విడిచి రోజు నీటిని సరఫరా చేస్తున్నామని తెలిపారు.


స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

స్థల పరిశీలన

ప్రజాశక్తి- పోలాకి

మండలంలోని గుప్పడిపేట పంచాయతీలో సీఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు ఫిషరీస్ శాఖ అధికారులు శుక్రవారం స్థలాన్ని పరిశీలించారు. స్కీమ్ ఆఫ్ ఫండ్ రిజర్వేషన్ ఆఫ్ ట్రేడిషనల్ ఇండస్ట్రీస్ ప్రపోజల్ కోస్టల్ భాగంగా గుప్పడిపేట, రాజపురం, కొత్తరేవు, కోవిరిపేట రాజరాంపురం గ్రామాల సభ్యులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. పీతలు సీఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ పెట్టడానికి ప్రపోజెల్ పెట్టడానికి ఈ ప్రాంతం అనుకూలంగా ఉంటుందని నాయకులతో చర్చించారు. ఎల్‌హెచ్ డిపిఎం నారాయణరావు, ఎపిఎం రాజారావు, ఎఫ్‌పిఒ ఎపిఎం ఈశ్వరరావు, ఫిషరీష్ డిపార్ట్‌మెంట్ కె.కృష్ణారావు, సిసిలు పాల్గొన్నారు.


వివరాలను సేకరిస్తున్న అంబేరిష్

గోదాము తనిఖీ

కొత్తూరు : గతేడాది జులై నెలలో రూ.1.09 కోట్లు విలువైన బియ్యం మండల లెవెల్ స్టాక్ పియింట్‌లో తేడా వచ్చిన విషయం విదితమే. దీనిపై ప్రొబిషనరీ డిప్యూటీ కలెక్టర్ అంబేరిష్ శుక్రవారం గొడౌన్‌లో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలో ఎటువంటి రికార్డు లేకపోవడంతో కంప్యూటర్ ఆపరేటర్‌ని అడిగి తెలుసుకున్నారు. తాను కొత్తగా వచ్చానని, గతంలో ఉన్న రికార్డులు పోలీసులు తీసుకెళ్లారని తెలిపారు. అనంతరం కొత్త రికార్డులను పరిశీలించారు. ప్రస్తుతం 45 క్వింటాళ్ల గోధుమలు నిల్వ ఉన్నట్లు డిటి, గొడౌన్ ఇన్‌ఛార్జి బాణాల వెంకటరమణ ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈయనతో పాటు తహశీల్దార్ పి.బాల, సిఎస్‌డిటి రౌతు రవి ఉన్నారు.

అంగన్వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

పలాస : కాశీబుగ్గ ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆయా పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని కాశీబుగ్గ ఐసిడిఎస్ ప్రాజెక్టు పిఒ శార్వాణి తెలిపారు. శుక్రవారం ఆమె తన కార్యాలయంలో మాట్లాడారు. పెద్దతామరాపల్లి-1, రౌతుపురం, వల్లభరాయపాడు, బెజ్జిపల్లి ప్రాంతాల్లో అంగన్వాడీ కార్యకర్తలు, పూడిలంక మినీ అంగన్వాడీ కార్యకర్త, హుకుంపేట, కొత్తఅగ్రహారం ,దేవుపురం, బోరుభద్ర, కణితివూరు-1, ఎం.ఎన్.పేట-1, పల్లివూరు-1, కొండవూరు, చినడోకులపాడు, సైనూరు, లొద్దభద్ర, సున్నాడ, బంటుకొత్తూరు ప్రాంతాల్లో ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. వీటికి ఈ నెల 18 నుంచి 25 వరకు దరఖాస్తులు చేసుకోవచ్చు అని తెలిపారు.

బూర్జ : మండలంలోని రెండు అంగన్వాడీ కార్యకర్తల పోస్టు భర్తీకి దరఖాస్తులకు ఆహ్వానిస్తున్నామని ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి కె.శ్రీలత ఒక ప్రకటనలో తెలిపారు. బూర్జ, కాళపర్తి గ్రామాల్లో పోస్టులు ఖాళీలు ఉన్నాయని అన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 25లోగా దరఖాస్తులను ఐసిడిఎస్ కార్యాలయానికి అందజేయాలని సూచించారు.

కొత్తూరు : మండలంలోని కుద్దిగాంలో ఖాళీగా అంగన్వాడీ ఆయా పోస్టు భర్తీకి దరఖాస్తు ఆహ్వానిస్తున్నామని ఐసిడిఎస్ పిఒ టి.విమలారాణి ఒక ప్రకటనలో తెలిపారు. ఒసి కేటగిరికి రిజర్వేషన్ కేటాయించామన్నారు. ఈ నెల 25వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తు అందజేయాలని కోరారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం

మెళియాపుట్టి : జగనన్న ఇళ్ల నిర్మాణాలు వేగవంతమయ్యేలా చర్యలు చేపట్టాలని హౌసింగ్ డిఇ వి.నర్సింగరావు సిబ్బందికి ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇళ్ల నిర్మాణాల ప్రగతిపై శుక్రవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలపై లబ్ధిదారులకు అవగాహన కల్పించి పనులు త్వరితగతింగా పూర్తయ్యేలా చూడాలన్నారు. సచివాలయ పరిధిలో ప్రజా ప్రతినిధులతో లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. లబ్ధిదారులతో జియో ట్యాగింగ్ పూర్తి


సమీక్షిస్తున్న డిఇ నర్సింగరావు

చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ బి.చంద్రకుమారి, హౌసింగ్ ఎఇ శ్రీనివాసరావు, పంచాయతీరాజ్ ఎఇ ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు.

మహిళల ఉజ్వల భవితకు ఉన్నత ప్రణాళిక

ఎపిఎం కూర్మారావు

ప్రజాశక్తి- ఆమదాలవలస

గ్రామీణ మహిళా సంఘాల ఉజ్వల భవిష్యత్‌కు ఉత్తమ ప్రణాళికను తయారు చేసుకొని అమలు పరచాలని వైఎస్ఆర్ క్రాంతి పథం అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ పైడి కూర్మారావు సూచించారు. పట్టణంలోని మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో తమ్మినేని ధనలక్ష్మి అధ్యక్షతన గ్రామ సంఘం అసిస్టెంట్లతో శుక్రవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వార్షిక వర్క్ అండ్ ఫైనాన్స్ ప్లాన్ తయారు



మాట్లాడుతున్న ఎపిఎం కూర్మారావు

చేసుకోవాలన్నారు. గ్రామాల్లోని ప్రతి మహిళా పొదుపు సంఘాలూ విధిగా పంచసూత్రాలు పాటించాలన్నారు. సమావేశాలు, పుస్తక నిర్వహణ, సొంత నిధుల సక్రమ వినియోగం గురించి సిబ్బంది ప్రణాళికను తయారు చేసుకొని అమలు చేయాలన్నారు. సంఘ సభ్యులు తాము దాసుకున్న పొదుపు మొత్తాల్లో నుంచి సభ్యుల అవసరం మేరకు అప్పులు ఇచ్చి వసూలు చేసుకోలేని సంఘం ఏ గ్రేడ్ లోనికి రాదని తెలిపారు. 18 నుంచి 70 ఏళ్ల మధ్య వయసు గల మహిళలకు వారి అర్హతను బట్టి వారి వ్యక్తిగత బ్యాంకు ఖాతా ద్వారా బీమా సౌకర్యం కల్పించాలని సూచించారు. జగనన్న గృహ నిర్మాణ పథకంలో లబ్ధిదారులందరికీ ఇళ్లు కట్టుకోవడానికి అవసరమైన పెట్టుబడికి, అర్హత గల మహిళలందరికీ తాత్కాలిక రుణ సౌకర్యాన్ని కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో మండల సమాఖ్య కార్యదర్శి వేణమ్మ, కోశాధికారి రేణుక, అకౌంటెంట్ కళ్యాణి, క్లస్టర్ కోఆర్డినేటర్లు రమణ, చంద్రరావు, రామప్పడు, సుభద్ర, ఉమా, జగదీష్ పాల్గొన్నారు.


రికార్డులను పరిశీలిస్తున్న ఎంపిడిఒ వెంకటరమణ

సచివాలయాల సందర్శన

సోంపేట: మండల కేంద్రంలోని సోంపేట సచివాలయం-1,2 కేంద్రాలను ఎంపిడిఒ వెంకటరమణ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన కార్యాలయంలో రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఇఒ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



రైలు ఢీకొని యువకుడు మృతి

పలాస : పలాస రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధి సుమ్మాదేవి రైల్వే స్టేషన్ ప్రాంతంలో శుక్రవారం రైలు ఢీకొని మందస మండలం పిడిమందసకు చెందిన అరసవల్లి సంతోష్‌కుమార్ (34) మృతి చెందినట్లు ఎస్ఐ షరీఫ్ తెలిపారు. రైలును గమనించకుండా పట్టాలు దాటుతుండగా... వేగంగా వచ్చిన రైలు ఢీకొనడడంతో అక్కడికక్కడే మృతి చెందారని అన్నారు. తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్ డ్రైవర్‌కు గాయాలు

ఆమదాలవలస : మండలంలోని నిమ్మతొర్లాడలో శుక్రవారం సాయంత్రం వీచిన గాలికి మామిడి చెట్టు కొమ్మ విరిగిపడి కొత్తవలసకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ దవళ జితేంద్ర కాలు విరిగింది. వివరాల్లోకి వెళ్తే... నిమ్మతొర్లాడ నుంచి మట్టి లోడుతో కొత్తవలస ఇటుక బట్టీకి వస్తున్నాడు. నిమ్మతొర్లాడ సమీపంలో గల తోటలోని మామిడి చెట్టు ఈదురు గాలులకు ట్రాక్టర్ టాప్‌పై విరిగిపడడంతో ట్రాక్టర్ ఇంజిన్‌కు, చెట్టు కొమ్మకు మధ్య డ్రైవర్ కాలు ఇరుక్కుపోయి విరిగిపోయింది. వెంటనే శేఖర్, చిన్నారావులు 108లో జిల్లా సర్వజనాస్పత్రికి తరలించారు.


జితేంద్రను తరలిస్తున్న 108 సిబ్బంది


శ్రీకాకుళం అర్బన్ : మాట్లాడుతున్న శంకరరావు


పొందూరు : అంత్యాక్షరి ఆడుతున్న విద్యార్థులు


ఎచ్చెర్ల : మాట్లాడుతున్న శ్రీకాంత్‌వర్మ

వేసవి శిబిరాలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో గ్రంథాలయ సంస్థ ద్వారా నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలను విద్యార్థులు సద్వినియోగ పరచుకోవాలని జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వివిజిఎస్ శంకరరావు సూచించారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో శుక్రవారం నిర్వహించిన విజ్ఞాన శిబిరాన్ని సందర్శించారు. శిబిరంలో ఉపాధ్యాయులు ఎల్.కృష్ణారావు, ఎస్.ఈశ్వరరావు, టి.ఎర్రమ్మలు పాల్గొని కథలు ఫజిల్స్, జోకులు, డ్రాయింగ్ అంశాలను బోధించారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ ఎస్.వి.రమణమూర్తి, కె.చిరంజీవులు, టి.రాంబాబు, పి.రామ్మోహన్, గణేష్ పాల్గొన్నారు.

టెక్కలి : విద్యార్థి దశ నుంచే దేశంపై భక్తిభావం పెంపొందించుకోవాలని ఆర్మీ ఉద్యోగి బి.రాజు అన్నారు. గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన విభిరంలో పాల్గొన్నారు. అలాగే వ్యాయామ ఉపాధ్యాయులు బి.జయకుమార్ ఆటల పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయ నిర్వాహకులు ఎస్.ఉదయ్‌కిరణ్, అమ్మనమ్మ పాల్గొన్నారు.

పొందూరు: పొందూరు శాఖాగ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గ్రంథాలయ అధికారి పి.వి.భాస్కరరాజా ఆధ్వర్యాన తెలుగు దినపత్రికల పఠణంపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు ఆటవిడుపుగా అంత్యాక్షరీ ఆటలను ఆడించారు.

ఎచ్చెర్ల : మండలంలోని ధర్మవరం శాఖాగ్రంథాలయం ఆధ్వర్యాన వేసవి విజ్ఞాన శిబిరంలో అమ్మ భాష, తెలుగు భాష గురించి, అమృతం వంటి తెలుగు భాష ప్రాముఖ్యత గ్రామ నివాసి, తెలుగు పండిట్ ట్రైనీ ఎం.శ్రీకాంత్‌శర్మ వివరించారు. మాతృభాష కళ్ల వంటిది, పర భాష కళ్లజోడు వంటిదని తెలియజేశారు. మన మాతృభాషను చక్కగా నేర్చుకొని మాట్లాడగలిగితే అన్ని రంగాల్లో ఉన్నత స్థితిని పొందగలుగుతామని తెలియజేశారు. చిన్నతనం నుంచి చిన్న చిన్న వాక్యాలుగా, పదాలుగా, పద్యాలుగా, వ్యాసాలు, రచనలు సాధించగల సమర్థత పిల్లల్లో కలగాలన్నారు. భవిష్యత్ తరానికి తెలుగు ప్రాముఖ్యత గురించి, ఔన్నత్యాన్ని గురించి చాటి చెప్పాలన్నారు. గొప్ప వాళ్ల రాసిన రచనలు పద్యాలు, గేయాలు, గద్యాలు, కథలు, కవితలు, పల్లె గీతాలు, కూని రాగాలు, ఇంకా హాస్య రచనలు, విప్లవ రచనలు, విప్లవ గీతాలు, చదవాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి మల్లిపెద్ది చంద్రశేఖర రావు, సహాయకులు బి.సూర్యనారాయణ, గ్రంథాలయ పాఠకులు మహేష్, జగదీష్, సురేష్, కిరణ్, సూరిబాబు, ప్రకాష్, 74 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

బలగ : బలగ శాఖాగ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వి.వి.జి.ఎస్.శంకరరావు ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవి విజ్ఞాన శిబిరాలు జూన్ 11 వరకు నిర్వహిస్తామని అన్నారు. ప్రతి విద్యార్థీ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి పి.ఉగ్రసేను, సిబ్బంది పాల్గొన్నారు.

టెక్కలి రూరల్: టెక్కలి శాఖాగ్రంథాలయం వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా 32 మంది విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. ముందుగా టగ్ ఆఫ్ వార్ (తాడు), తర్వాత సీనియర్ విద్యార్థులకు డోగ్రీ బాల్ ఆటలను నిర్వహించారు. పాల్గొన్న విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచారని గ్రంథాలయాధికారి ఎస్.రామారావు తెలిపారు. కార్యక్రమంలో ఉదయ్‌కిరణ్, బి రాజు, బి.జయకుమార్, అమ్మన్నమ్మ పాల్గొన్నారు.


టెక్కలి రూరల్ : వాలీబాల్ ఆడుతున్న విద్యార్థులు

'కుప్పిలి'కి ఈమాసం కవి పురస్కారం


వెంకట రాజారావు

ఆమదాలవలస : అమరావతి సాహితీ సమితి ప్రతినెలా నిర్వహించే 'ఈ మాసం కవి' పురస్కారానికి పట్టణానికి చెందిన కవి రచయిత కుప్పిలి వెంకట రాజారావుకు ఆహ్వానం అందింది. గుంటూరులో ఈ నెల 21న జరగబోయే కవి సమ్మేళనంలో కె.వి.రాజారావు తాను రచించిన పది కవితలను పఠనం చేసి సత్కారం అందుకోనున్నారు. ఈ మేరకు అమరావతి సాహితీ సమితి అధ్యక్షుడు డాక్టర్ రావి రంగారావు నుంచి సమాచారం అందింది. రాజారావు 'ఈ మాసం కవి'గా ఎంపిక కావడంపై పట్టణంలోని పలువురు సాహితీవేత్తలు అభిమానులు అభినందనలు తెలియజేశారు.


పెళ్లి కానుకను అందిస్తున్న సభ్యులు

హెల్పింగ్ హేండ్స్ 'పెళ్లి కానుక'

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని చిన్నసహలలపుట్టుగకు చెందిన బెహరా తిలోత్తమకు అదే మండలం బొరివంకకు చెందిన హెల్పింగ్ హేండ్స్ స్వచ్ఛంద సంస్థ పెళ్లికానుక అందించి మరోసారి తన ఉదారత చాటుకుంది. చిన్నప్పుడే తల్లిదండ్రులను కోల్పోయిన తిలోత్తమకు ఇటీవల పెళ్లి నిశ్చయించారు. అయితే ఆమె ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే అని తెలుసుకున్న హెల్పింగ్ హేండ్స్ సభ్యులు శుక్రవారం గ్రామానికి చేరుకుని తమ సేవా సంస్థ తరపున రూ.10 వేలు, రెండు బియ్యం బస్తాలు, రూ.వెయ్యి విలువ చేసే పెళ్లి చీరను తిలోత్తమకు పెళ్లి కానుకగా అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులుడు బల్లెడ లక్ష్మణమూర్తి, హెల్పింగ్ హాండ్స్ సభ్యులు పాల్గొన్నారు.

22న ఆలయ వార్షికోత్సవం

కోటబొమ్మాళి: మండలంలోని గుంజిలోవలో ఈనెల 22 నుంచి 24 వరకు వెంకటేశ్వస్వామి ప్రథమ వార్షిక మహోత్సవం నిర్వహిస్తున్నామని ఆలయ నిర్మాణ, శాశ్వత ధర్మకర్తలు పేడాడ చిరంజీవులు, భారతిలు ఒక ప్రకటనలో తెలిపారు. యాత్రికులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

రేపు కళింగపట్నం తీరంలో 'స్వచ్ఛత'

శ్రీకాకుళం అర్బన్ : ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యాన ప్రజలకు అవగాహన కల్పించేందుకు లైఫ్‌స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ పేరుతో స్వచ్ఛత కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మండలి ఇఇ శంకర్ నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21న ఉదయం 7 నుంచి 9 వరకు కళింగపట్నం సముద్రతీరంలో ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. నగర ప్రజలు, ప్రజాప్రతినిధులు, పారిశ్రామిక వేత్తలు, పర్యావరణ ప్రేమికులు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

ముమ్మరంగా భూ రీ సర్వే

ప్రజాశక్తి- బూర్జ

మండలంలో పెద్దపేట సచివాలయం పరిధి కొండపేట, పెద్దపేట, నీలాపురం గ్రామాల్లో వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూ హక్కు, శాశ్వత భూ రక్ష పథకంలో శుక్రవారం డ్రోన్ సర్వే నిర్వహించారు. ఈ పథకం రైతులకు మేలు చేకూరుతుందని పంచాయతీరాజ్ ఛాంబర్ ఉపాధ్యక్షులు, సర్పంచ్ ప్రతినిధి ఎ.రామకృష్ణ తెలిపారు. బ్రిటిష్ కాలం నుంచి ఇంత వరకు పరిష్కారం కాని ఎన్నో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏపిఎసిఎస్ డైరెక్టర్ వావిలపల్లి గోవిందరావు, సర్పంచ్ డి.వి.ఎ.నాయుడు, సచివాలయ కన్వీనర్ రామచంద్ర పాడి, గండ్రేటి రాము పాల్గొన్నారు.


డ్రోన్ ద్వారా సర్వే చేస్తున్న అధికారులు

సైబర్ మోసాలపై అప్రమత్తం

యూనియన్ బ్యాంకు మేనేజర్ శ్రీనివాసరావు

ప్రజాశక్తి- ఆమదాలవలస

సైబర్ మోసాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని యూనియన్ బ్యాంకు మేనేజర్ శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో ఫ్రెండ్స్ ఆఫ్ కోకోనెట్ ట్రీ శిక్షణా కార్యక్రమంలోని రైతులకు ఆర్‌బిఐ పథకంలో భాగంగా యూనియన్ బ్యాంకు సౌజన్యంతో ఎస్ఎస్‌టి స్వచ్ఛంద సంస్థ నిర్వహణలో రైతులకు ఆర్థిక అక్షరాస్యత శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పలానా బ్యాంకు నుంచి మాట్లాడుతున్నామని ఎవరైనా ఫోన్లు చేసి బ్యాంక్ అకౌంట్ వివరాలను అడిగితే సమాచారాన్ని ఇవ్వవద్దని సూచించారు. బ్యాంకులు అటువంటి సమాచారాన్ని లబ్ధిదారులకు అడగవని తెలిపారు. ఎటిఎంలో అపరిచితులకు డబ్బులు విత్ డ్రా చేసి పెట్టమని కార్డును ఇవ్వరాదని సూచించారు. అలాగే ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన వార్షిక ప్రీమియం కేవలం రూ.20తో రూ.2 లక్షల ప్రమాద బీమా లభిస్తుందని తెలిపారు. 18 నుంచి 70 ఏళ్ల వయసు గల వ్యక్తులకు బీమా వర్తిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి, ఉద్యానవన శాస్త్రవేత్త డాక్టర్ వి.హరి కుమార్, సిఎఫ్ఎల్ కో-ఆర్డినేటర్ చిగురుపల్లి వెంకటేష్ (చిన్ను) పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న మేనేజర్ శ్రీనివాసరావు


రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారులు ప్రతిష్టశర్మ, ఇమ్మా

ఇంటి వద్దకే వైద్య సేవలు

ప్రజాశక్తి- జి.సిగడాం

రాష్ట్ర ప్రభుత్వం ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమంలో భాగంగా ఇంటి వద్దకే వైద్య సేవలు అందజేస్తుందని, రోగులు సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ వైద్యాధికారి ప్రతిష్ట శర్మ తెలిపారు. మండలంలోని దేవరవలసలో శుక్రవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక సచివాలయం ఆవరణంలో గ్రామంలోని ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇంటి వద్దకే వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి ఈ పథకం ఎంతో మేలు చేకూరుతుందన్నారు. హెల్త్ అధికారిణి కె.ఇమ్మా మాట్లాడుతూ దేవరవలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో పాటు గ్రామంలోనే వైద్య సేవలు అందుబాటులో ఉండేలా వైఎస్ఆర్ విలేజ్ క్లినిక్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని తెలిపారు. దీని ద్వారా 67 రకాల మందులతో పాటు 14 రకాల పరీక్షలు చేసి ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలను అందజేస్తుందని అన్నారు. గర్భిణులను, బాలింతలను, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే రోగులను, మానసిక రోగులను పరీక్షలు మందులు అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, ఎఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.


ఆక్రమణలను తొలగిస్తున్న కూలీలు

ఆక్రమణల తొలగింపు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని జిటి రోడ్డులో ఉన్న వ్యాపార సముదాయాల్లో ఆక్రమణలను నగరపాలక సంస్థ అధికారులు తొలగించారు. గట్టి పోలీసు బందోబస్తు మధ్య ఏడు రోడ్ల కూడలి వద్ద శుక్రవారం చేపట్టిన ఆక్రమణల తొలగింపు ప్రక్రియ సాయంత్రం వరకు కొనసాగించారు. కల్వర్టులు మూసుకుపోవడంతో కాలువల్లో ఉన్న చెత్తను తొలగించేందుకు వీలు పడటం లేదని, కాలువలపై ఉన్న ఆక్రమణలు తొలగించడం ద్వారా పూడికలను తొలగించడానికి వీలవుతుందని అధికారులు చెబుతున్నారు.